


## ఐవాచ్.. షీ సేఫ్

**మహిళల** భద్రతకు ఎన్నిరకాల యాప్‌లు, పరికరాలను కనిపెట్టినప్పటికీ దేశవ్యాప్తంగా దారుణాలు జరుగుతూనే ఉన్నాయి. ఒంటరిగా ప్రయాణిస్తున్న మహిళలకు భద్రత కల్పించేందుకు అందుబాటులోకి వచ్చిన మరో అప్లికేషన్ ఐవాచ్ (eyewatch) SOS. ఈ అప్లికేషన్ మొబైల్ ఫోన్‌ను రక్షక కవచంగా మారుస్తుంది. అపాయం ఎదురైనప్పుడు, ఎవరైనా దుండగులు వెంటపడినప్పుడు ఈ అప్లికేషన్‌ను ట్యాప్ చేస్తే చాలు అందులో నమోదు చేసి ఉంచిన నెంబర్లకు అలర్ట్ వెళ్తుంది. దీనిద్వారా లొకేషన్ ట్రాకింగ్ చేయవచ్చు. ఈ అప్లికేషన్‌లో మహిళలు గరిష్ఠంగా 10 కాంటాక్ట్స్ ఎంచుకుని స్పీడ్ డయల్ నెంబర్లుగా పెట్టుకోవచ్చు. దీనిని ట్యాప్ చేయగానే ఆయా వ్యక్తుల ఫోన్లకు SOS అలర్ట్ వెళ్తుంది. ఈ అప్లికేషన్ పని చేయడానికి జీపీఎస్ అవసరం లేదు. నెట్‌వర్క్ లేని ప్రాంతాల్లో కూడా ఈ అప్లికేషన్ పనిచేస్తుంది. చదువుకునే అమ్మాయిలు, ఉద్యోగాలు చేసే మహిళలతోపాటు ఒంటరిగా ప్రయాణించేవారికి కూడా ఈ ఐవాచ్ SOS రక్షణ కల్పిస్తుంది.

నమస్తే తెలంగాణ
# జిందగీ
హైదరాబాద్ | శుక్రవారం 24 మే 2024 www.ntnews.com



## పుట్టగొడుగు.. కాఫీ అడుగు



వేడివేడి నురగలు కక్కే కాఫీ గొంతు దాటనిదే చాలామందికి రోజు ప్రారంభం కాదు. కొందరికైతే గంటకోసారి కాఫీరాగం పలకకపోతే విసుగు పుడుతుంది. మెదడును ఉత్తేజపరచడంలో కాఫీ ఔషధంగా పనిచేస్తుంది. ఉదయాన్నే ఫిల్టర్ కాఫీ, మధ్యాహ్నానికి ఇన్‌స్టంట్ కాఫీ, సాయంత్రం మోచా కాఫీ ఇలా విడతల వారీగా రకరకాల కాఫీలు టేస్ట్ చేస్తుంటారు. ఈ రకాల్లో ఒకటి మష్రూమ్ కాఫీ. పుట్టగొడుగును ఎక్కువగా కూరలు, పిజ్జాల్లో సీజనింగ్‌గా వాడతారని తెలిసిందే. కానీ వీటితో చేసే కాఫీ కూడా చాలా ప్రత్యేకం. దీంతో పలు ఆరోగ్యప్రయోజనాలు ఉన్నాయి.

- మష్రూమ్ కాఫీ ఆందోళన, ఒత్తిడి తగ్గిస్తుంది. ఈ కాఫీలో అడాప్టోజెనిక్ లక్షణాలు ఉంటాయి. ఇవి ఒత్తిడిని తగ్గించేందుకు దోహదపడతాయి.
- పుట్టగొడుగుల కాఫీ తీసుకోవడం వల్ల శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. సీజనల్ వ్యాధుల బారినపడేవారు తరచూ ఈ కాఫీ తాగడం మేలు.
- ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు మెండుగా లబిస్తాయి. ఇవి ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు చర్మ, జుట్టు సమస్యలను నివారిస్తాయి.
- మష్రూమ్ పౌడర్ సూపర్ మార్కెట్, ఆన్‌లైన్‌లోనూ లభిస్తుంది. చక్కెర, ఇన్‌స్టంట్ కాఫీ పౌడర్, పాలు కలిపి ఆ తర్వాత మష్రూమ్ పౌడర్ కలిపితే చాలు.. వేడివేడి మష్రూమ్ కాఫీ రెడీ!

## సమాధానమివ్వండి

ఈ రోజుల్లో పిల్లల పెంపకం తల్లిదండ్రులకు సవాలుగా మారింది. ఈ తరం పిల్లల్లో చాలామంది హైపర్ యాక్టివ్‌గా ఉంటున్నారు. మరికొందరు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుంటారు. పదిమందిలో ఉన్నా.. నిశ్శబ్దంగా తమ పనిలో తాము నిమగ్నమవుతుంటారు. ఇలాంటి పిల్లలను అలాగే వదిలేస్తే.. పెద్దయ్యాక వారిలో ఆత్మన్యూనతా భావం పెరిగిపోతుంది. చొచ్చుకుపోయే స్వభావం లేకుడా పోతుంది. అలా జరుగొద్దంటే ఈ టిప్స్ పాటించండి..



**పిల్లలు** నిరంతరం చదువులు, ఆటల్లో మునిగిపోకుండా ఇంటిపనిలో భాగం చేయాలి. వారికి చిన్న చిన్న పనులు నేర్పుతుండాలి. పనిచేసే క్రమంలో ఎన్నో కొత్త విషయాలు నేర్చుకుంటారు. ఇది వాళ్ల మానసిక ఎదుగుదలకూ దోహదం చేస్తుంది. పని చేసే క్రమంలో పిల్లలను గమనించడం ద్వారా వారి మానసిక స్థితిగతులను, భావోద్వేగాలనూ తెలుసుకునే వీలు ఉంటుంది.

**పిల్లలకు** వారి అనుభవాల ఆధారంగా కథలు చెప్పడం నేర్పించాలి. దీనివల్ల వారి జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది. వారిలోని లోపాలను వారు అధిగమించగలుగుతారు. పిల్లలు సరిగ్గా కమ్యూనికేట్ చేయడానికి, ఎమోషనల్ డెవెలప్‌మెంట్ కోసం.. తల్లిదండ్రులు పిల్లలతో ఆరోగ్యకరమైన, దృఢమైన బంధాన్ని ఏర్పరచుకోవాలి.

**పిల్లలు** ఏవైనా ప్రశ్నలు అడిగినపుడు విసుగు తెచ్చుకోకుండా, సమాధానాలు చెప్పటం వల్ల వారికి కొత్త విషయాలు తెలుసుకోవాలనే కుతూహలం పెరుగుతుంది. వాళ్లు కొత్త విషయాలు తెలుసుకుంటున్న కొద్దీ వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఏమైనా అడిగినపుడు తిట్టి, కొట్టి నిశ్శబ్దంగా కూర్చోబెడితే వారు ప్రశ్నించే తత్వాన్ని కోల్పోతారు. ఇది అలాగే కొనసాగితే వారి అభివృద్ధికి మీరే అడ్డుతగిలినట్టు అవుతుంది.

# లాపతా.. కుచ్ కహో!





నామ్.. ఫూల్
పతా.. తెలియదు.
పతి.. ఏమయ్యాడో తెలియదు.
పరపతి.. పదిమందీ ఏమనుకుంటారోనని బెంగ.
ఓ జాడలేని అమ్మాయి కథ ఇది.

నామ్.. జయ ఉరఫ్ పుష్పరాణి.
పతా.. తెలిసినా చెప్పదు.
పతి.. చెప్పాలనిపించదు.
పరపతి.. పదిమందీ మెచ్చుకునే స్థాయికి ఎదగాలి.
తన ఉనికి కోసం సాహసానికి పూనుకున్న అమ్మాయి కథ కూడా ఇదే!

**ఇద్దరమ్మాయిల కథ.. 'లాపతా లేడీస్' - జాడలేని మహిళలు. మార్చి 1న థియేటర్‌లో విడుదలైంది. చూసినోళ్లు బాగుందన్నారు. తెలిసినోళ్లకు తప్పకుండా చూడండి అని చెప్పారు. అప్పుడు ఎంత మంది చూశారో తెలియదు గానీ, నెట్‌ఫ్లిక్స్‌లో రిలీజైనప్పటి నుంచి 'లాపతా లేడీస్' రికార్డు స్ట్రీమింగ్ నమోదు చేసుకుంటున్నది. ఇందులో అంతలా వింత ఏముంది? ఈ సినిమాలో ఏదో ఉంది. ఈ చిత్రం ఏదో సందేశం ఇచ్చింది. పైకి కనిపించదు కానీ.. లోతుగా చూస్తే 'లాపతా.. ఏదో చెప్పనయితే చెప్పింది'!**

'లాపతా లేడీస్'లో నవ్వులు న్నాయి. ముఖ్యంగా ఫూల్ నవ్వు మనల్ని నవ్వించదు. 'అయ్యో!' అనిపిస్తుంది. పుష్ప నవ్వినప్పుడూ నవ్వు రాదు. ఎంతకు తెగించిందన్న కోపం వస్తుంది. ఈ సినిమాలో సరదా సన్నివేశాలెన్నో! భర్తతో కలిసి అత్తారింటికి మొదలుపెట్టిన ప్రయాణం ఆమెకు సరదాగానే అనిపిస్తుంటుంది. కానీ, చూస్తున్న మనకు మాత్రం ఏదో వెలితి. నవ వధువు బలికావడానికే వెళ్తుందేమోనన్న భయం వెంటాడుతుంది. బండి ఎక్కడం, పడవకు మారడం, బస్సెక్కడం వరకు బాగానే ఉంటుంది. భార్య నగలు తీసుకున్న భర్తను చూస్తే ఒళ్లు మండుతుంది. కట్టుకున్నవాడు కోరగానే క్షణం ఆలోచించకుండా నగలన్నీ ఇచ్చేసిన ఆమె అమాయకత్వం చూసి పాపం అనిపిస్తుంది. ఆపై రైలు ప్రయాణం.. ఫూల్‌కేమో గానీ, అప్పటికే ఆమెపై జాలితో ఉన్న ప్రేక్షకులకు మాత్రం కలవరం కలిగిస్తుంది. ఆ పిల్ల బతుకు ఏమవుతుందో అని గుండె బరువెక్కుతుంది.

❖ ❖ ❖

ప్రేక్షకులు అనుకున్న దానికి భిన్నంగా ఓ చిత్రం జరుగుతుంది. దీపక్, ఫూల్ జంట ప్రయాణిస్తున్న రైలులోనే మరో రెండు కొత్త జంటలు. నవ వధువులందరూ ముఖాలపై ఘూంఘట్ (కొంగు) కప్పుకొనే ఉంటారు. అందరిదీ ఒకే సంప్రదాయ వస్త్రశ్రేణి. ఎవరు ఎవరో పోల్చుకోవడం కష్టమే! రాత్రి పది దాటుతుంది. ఓ ఊరొస్తుంది. దీపక్ కునికిపాట్లు పడుతున్న ఫూల్‌ను రైలు దిగమంటాడు. భర్తతో కదులుతుంది. మళ్లీ బస్సెక్కుతుంది. మధ్యరాత్రికి ఓ పల్లెకు చేరుకుంటుంది. ఇంట్లో వాళ్లంతా కొత్తజంటకు దిష్టి తీస్తారు. కోడలమ్మ ముఖంపై ఉన్న ఘూంఘట్ తొలగిస్తుంది దీపక్ తల్లి. అక్కడుంది పుష్ప కాదు. వేరెవరో అమ్మాయి. ఇంకెవరో ఇల్లాలు. ఆమె పేరు జయ. దీపక్ ఇంట్లోవాళ్లకు పుష్పగా పరిచయం చేసుకుంటుంది.

❖ ❖ ❖

ఇక్కడ రైలు ప్రయాణం ఇంకా కొనసాగుతూనే ఉంటుంది. జయ భర్త.. ఘూంఘట్‌లో ఉన్నది తన భార్యే అనుకొని ఫూల్ భుజం తట్టి 'స్టేషన్ వచ్చింది' అని చెప్పి రైలు దిగుతాడు. ఫూల్ రైలు దిగేసరికి దీపక్ కనిపించడు. ఇందాక భుజం తట్టింది తన భర్తే అనుకుంటుందామె. తనకన్నా ముందే రైలు దిగిన భర్త ఎక్కడికి వెళ్లిపోయాడో అని స్టేషన్ అంతా వెతుకుతుంది. ఎక్కడా కనిపించడు. మరోవైపు రైలు వెళ్లిపోయినా జయ జాడ కనిపించదు. పరారైంది అనుకుంటాడు జయ భర్త. భార్య తప్పిపోయిందన్న బెంగ కన్నా.. పదిహేను తులాల బంగారం పోయిందని కస్సుబుస్సవుతాడు. 'అది దొరకాలి.. దాని సంగతి చెప్తా' అనుకుంటూ కోపంగా బయటికి వెళ్లిపోతాడు. ఆ సమీపంలోనే ఫూల్ భయంతో, బాధతో ప్లాట్‌ఫామ్‌పై కూలబడిపోతుంది.

❖ ❖ ❖

ఒంటరి ఆడపిల్ల. కొత్తగా పెండ్లయిన ఆడపిల్ల. స్టేషన్ మాస్టర్‌ను కలుస్తుంది. ఆమె సమస్యను పూర్తిగా అర్థం చేసుకోలేకపోతాడు. ఆమెకు సాయం చేయాలనే భావిస్తాడు. 'మీ భర్త ఊరు ఏంటి?' అని అడుగుతాడు. సమాధానం 'తెలియదు'. ఎందుకు తెలియదు? ఏమో ఆమెకే కాదు.. చాలామందికి తెలియదు. భర్త ఏం చేస్తాడో తెలియదు. ఎలాంటి వాడో అస్సలు తెలియదు. మధ్యప్రదేశ్, బీహార్, రాజస్థాన్ తదితర హిందీ రాష్ట్రాల్లో నిరుపేద కుటుంబాల్లో నేటికీ ఇదే పరిస్థితి. పెద్దవాళ్లు నిశ్చయించడం.. పిల్లలు తలలు వంచడం ఇప్పటికీ షరామామూలే! ప్రేమించే పెండ్లి చేసుకోవాలని కాదు! పెద్దలు చూసినా.. పిన్నలు మాట్లాడుకుంటేనే కదా ముడి చక్కగా పడేది. ఆ మాటడిగితే పెద్దల దగ్గర సమాధానం ఉండదు. కట్నం సమర్పించుకోలేని నిరుపేద తండ్రులు గంతకు తగ్గ బొంత అని ఓ సంబంధం చూడటం, పెండ్లి కానిచ్చేయడం ఇప్పటికీ అక్కడే కాదు.. చాలాచోట్ల కామన్. అలా కుదిరిందే పుష్ప పెండ్లి. అందుకే ఆమెకు భర్త గురించేం తెలియదు. అతగాడు ఘూంఘట్ వేసుకోడు కాబట్టి ముఖం మాత్రమే తెలుసు.

> 'లాపతా లేడీస్' సాదాసీదా కథైతే కాదు. అలాగని అత్యద్భుతమైనదీ కాదు. మనసులు కలవని మనువులు, మనుషులు తెలియని మనువులు ఇలాంటి విపత్కర పరిస్థితులకు దారి తీయొచ్చని హెచ్చరిస్తుంది. వీలు చూసుకొని ఒకసారి చూడండి. వీలైతే ఇంకోసారి చూడండి. రైల్వే స్టేషన్‌లో ఫూల్, ఆమెను ఆదరించిన పెద్దమ్మ మాటలు ఆలోచింపజేస్తాయి. ఆడపిల్లలపై సమాజంలో గూడుకట్టుకున్న దురుద్దేశాలు కొంతవరకైనా మలిపేస్తాయి!!

❖ ❖ ❖

ఆ ముఖంలో ఏం చూసిందో.. మంచోడని నమ్మింది. తనతో నవ్వుతూ చెప్పిన మాట ఒకటి గుర్తుంది. అది 'ఐ లవ్యూ'! దానికే మురిసిపోయింది. ప్రేక్షకులు ఊహించినట్టు దీపక్ దొంగ సచ్చినోడు కాదు. తన వెంట వచ్చిన పుష్పను గౌరవంగా చూస్తాడు. తను విడిచి వచ్చి ఫూల్ కోసం ఆరాటపడుతుంటాడు. అయినా ఏం లాభం! తను ఏ స్టేషన్‌లో దిగిందీ దీపక్‌కు తెలియదు. పెండ్లినాడు దిగిన ఫొటో ఒక్కటే ఆధారం. దానిని పోలీసులకు చూపిస్తాడు. ఘూంఘట్ ధరించి ఉన్న ఫూల్ ముఖాన్ని ఏ ముఖం పెట్టుకొని వాళ్లు వెతకగలరు.

❖ ❖ ❖

ఈ సమాజంలో మంచికి ఇంకా నెలవుంది. ఓ మంచి ఆడమనిషి తోడు ఫూల్‌కు దొరుకుతుంది. జీవితాన్ని కాచి వడబోసిన ఆ మంచామె.. ఫూల్‌ను కూతురిగా భావిస్తుంది. ఆమె కథంతా విని.. దీపక్ దగుల్బాజీ అనీ, నీ నగలన్నీ కట్టుకొని ఉడాయించాడనీ నిందిస్తుంది. ఆ మాటలకు ముఖం చిన్నబుచ్చుకున్న నవ వధువును ఊరడిస్తూ.. లోపల ఎలా అనుకున్నా.. పైకి మాత్రం వస్తాడులే అని నమ్మకంగా చెబుతుంది. దీపక్ నివాసంలో పుష్ప చర్యలు వింతగా సాగుతుంటాయి. ఎవరికో ఫోన్ చేస్తుంది. తన నగలు కుదువపెట్టి ఏవేవో చేస్తుంటుంది. పోలీసులు ఆమెను అనుమానిస్తారు. గట్టిగా నిలదీస్తారు. ఆమె పుష్ప కాదనీ, జయ అని తీర్మానించుకుంటారు. ఆమె భర్త జాడ తెలుసుకొని అతనికి సమాచారం ఇస్తారు.

❖ ❖ ❖

పుష్పను పోలీసులు అష్టదిగ్బంధనం చేస్తారు. పెండ్లిళ్లు చేసుకొని నగలతో ఉడాయించే అమ్మాయిగా అనుమానిస్తాడు దీపక్. తన భార్యను ఏమార్చిందీ తనేనని అనుమానిస్తాడు. కానీ, జయ చొరవతో ఫూల్ జాడ తెలుస్తుంది. ఆమె ఉన్న రైల్వేస్టేషన్ మాస్టర్ ఫోన్ ద్వారా సమాచారం ఇస్తాడు. ఫూల్‌ను దీపక్ వాళ్లున్న ఊరు రైలు ఎక్కిస్తాడు. ఆమెను చేరదీసిన పెద్దమ్మ నిండుగా వీడ్కోలు పలుకుతుంది. గంటన్నర ప్రయాణం తర్వాత రైలు అత్తారింటి సమీపంలో ఉన్న స్టేషన్‌కు చేరుకుంటుంది. ఫూల్ రాకకోసం దీపక్ ఎదురుచూస్తుంటాడు. దీపక్ తనకోసం వేచి ఉంటాడని ఆమె భావిస్తుంది. అనుకున్నట్టే జరుగుతుంది. ఫూల్ కథ సుఖాంతం.

❖ ❖ ❖


జయ భర్త స్టేషన్‌కు వస్తాడు. ఆమెను దుర్భాషలాడతాడు. తను అతని వెంట వెళ్లనంటుంది. అగ్రికల్చర్ ఫార్మింగ్‌లో పీజీ చేయాలని ఉందని చెబుతుంది. అందుకోసం డెహ్రాడూన్ వెళ్లాలనుకుంటుంది. మొదటి భార్యను పొట్టన పెట్టుకొని, కట్నం కోసం తనను పెండ్లాడిన భర్తను చీడపురుగులా చూస్తుంది. మొదట్లో జయను అనుమానించిన ఇన్‌స్పెక్టర్ ఆమెకు అండగా నిలుస్తాడు. పోలీస్‌స్టేషన్‌లోనే 'నీ అంతు తేలుస్తాన'ంటూ వాగిన జయ భర్తను నాలుగు తన్ని తరిమేస్తాడు. దీపక్ కుటుంబం అంతా వచ్చి జయను డెహ్రాడూన్ సాగనంపుతుంది.

**ఆమిర్‌ఖాన్** బ్యానర్‌పై నిర్మించిన ఈ సినిమా రచయితలు బిప్లబ్ గోస్వామి, దివ్యనిధి శర్మ. ఈ చిత్రానికి ఆమిర్‌ఖాన్ మాజీ భార్య కిరణ్ రావ్ దర్శకురాలు. ఫూల్‌గా నితాన్షి గోయెల్ పెర్ఫార్మెన్స్ ముచ్చటనిపిస్తుంది. స్పర్శ్ శ్రీవాస్తవ్ పోషించిన దీపక్ పాత్రపై ఫస్టాఫ్‌లో అనుమానం, సెకండాఫ్‌లో అభిమానం కలుగుతాయి. జయగా ప్రతిభ రంత అదరగొట్టింది. అన్నిటికీ మించి పోలీస్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌మనోహర్‌గా రవికిషన్ నటన నచ్చుతుంది.


## కొరియన్.. మెరిసెన్

నగ ధగలు


**కొరియన్... ఇప్పుడు ఇండియాలో ట్రెండింగ్. బ్యూటీ, హెల్త్ టిప్స్, డ్రెస్సింగ్ స్టయిల్... అన్నిటా అక్కడి పద్ధతుల్ని మన వాళ్లు ఆచరిస్తున్నారు. ఇక, నగలు మాత్రం మడికట్టుకుంటాయా. తమ సౌందర్యాన్ని ఎవరైనా సరే ఆస్వాదించవచ్చని అమాంతంగా వచ్చి ఇక్కడ వాలిపోతున్నాయి. అందుకే నగల మోడళ్లలోనూ కొరియనే ఫ్యాషన్!**




**మన** ఆభరణాల్లో నవరత్నాలకు ప్రాధాన్యం ఇచ్చినట్లే, కొరియాలో అమెథిస్ట్, వైట్ జేడ్, గ్రీన్ జేడ్, స్మోకీ టోపాజ్‌లాంటివి విలువైన రత్నాలకు విలువిస్తారు. అమెథిస్ట్ కొరియన్లలో అత్యంత ప్రాచుర్యం పొందిన రాయి. ఇది మానసిక, శారీరక ప్రయోజనాలను అందిస్తుందని నమ్ముతారు. తెలుపు, ఆకుపచ్చ జేడ్‌లను ధరించడం ఆరోగ్యానికి మంచిదని భావిస్తారు. అందమైన నగల్లో స్మోకీ టోపాజ్‌కి ప్రాధాన్యం ఎక్కువ. కొరియన్ జువెలరీ బంగారం, వెండితో తయారైనప్పటికీ వాటిలో రాళ్లు, వజ్రాలు, ముత్యాలు, ఎనామిల్ మెరుపుల మేళవింపు ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ఇవి సాధారణ నగల కంటే మరింత అందంగా మెరిసిపోతాయి.









### నోరిగే...



సంప్రదాయ కొరియన్ జువెలరీలో అధిక ప్రాచుర్యం పొందిన ఆభరణాలు నోరిగే, బిన్యో‌ను. ఈ ఆభరణాలను బంగారం, వెండి లోహాలకు పట్టు దారాలు జోడించి తయారు చేస్తారు. ప్రకృతి, దైనందిన జీవితం ప్రేరణగా వీటిని రూపొందిస్తారు. అందుకే ఈ తరహా నగల్లో పువ్వులు, ఆకులకు ప్రాధాన్యం ఎక్కువ. కొరియన్ ఆభరణాలకు జోడించే పొడవాటి టాజిల్స్ కూడా ప్రత్యేకంగా ఆకట్టుకుంటాయి. వీటిని ధరించడం వల్ల సంపద, శాశ్వత యవ్వనం, అదృష్టం కలుగుతాయని నమ్ముతారు కొరియన్లు. ఇప్పుడు ఈ నగలు మనదగ్గరా టాప్‌లో ఉన్నాయి. ఆన్‌లైన్‌తో పాటు ప్రముఖ జువెలరీ షాపుల్లోనూ కొరియన్ స్టోర్స్ పేరుతో ప్రత్యేకంగా ఈ నగలను విక్రయిస్తున్నారు. మరెందుకు ఆలస్యం.. మీరూ ఓసారి ట్రై చేసి చూడండి!



## ఉప్పు తక్కువైనా పర్వాలేదు

**నలభీములు** చేసిన పాకమే అయినా చిటికెడంత ఉప్పు తక్కువైతే రుచించదు. అలాగని కూరల్లో తక్కువైందని పై ఉప్పు వేసుకుంటే ప్రమాదమని హెచ్చరికలు ఉండనే ఉన్నాయి. ఎక్కువైతే ముద్ద నోట్లోకి దిగదు. ఈ సమస్యకు పరిష్కారంగా పుట్టుకొచ్చిందే ఈ ఎలక్ట్రిక్ స్పూన్. 'కిరిన్ హోల్డింగ్స్' అనే జపనీస్ డ్రింక్స్ సంస్థ దీనిని డిజైన్ చేసింది. ఈ చెంచాతో తింటే.. పదార్థంలో ఉప్పు ఎక్కువ తక్కువలున్నా.. దాన్ని రుచికరంగా మార్చేయడమే దీని ప్రత్యేకత. ఈ సాంకేతిక పరిశోధనకుగానూ ఎన్నో ప్రశంసలు దక్కాయి. ఉప్పు తప్పులను ఒప్పు చేసే కిరిన్ ఎలక్ట్రిక్ సాల్ట్ స్పూన్లకు ఆన్‌లైన్‌లో మంచి డిమాండ్ ఉంది.



ఈ నెలలో 200 చెంచాల ధర 19,800 యెన్‌లు పలికాయి. రానున్న జూన్ నుంచి ఆఫ్‌లైన్‌లోనూ ఈ స్పూన్లు అందుబాటులోకి రానున్నాయని సంస్థ ప్రకటించింది. ఐదేండ్లలో పదిలక్షల మంది ఈ సాల్ట్ చెంచాల వినియోగదారులను కలిగి ఉండటమే తమ లక్ష్యమని కిరిన్ హోల్డింగ్స్ ప్రకటించింది. ప్లాస్టిక్, మెటల్ వెరైటీలతో రూపొందిన ఈ చెంచాను మీజీ యూనివర్సిటీ ప్రొఫెసర్ హోమీ మియాషితా అభివృద్ధి చేశారు. నాలుకపై సోడియం అణువులను కేంద్రీకరించడానికి ఈ ఎలక్ట్రిక్ చెంచా నుంచి తేలికపాటి విద్యుచ్ఛక్తి విడుదలై ఆహారం రుచి ఉప్పుగా మారుతుందట. ఈ చెంచా బరువు 60 గ్రాములు. రీచార్జ్ చేయడానికి అనువుగా ఉండే లిథియం బ్యాటరీ సాయంతో ఇది పని చేస్తుంది.